# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 01-06-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆసియా అభివృద్ధి బ్యాంకు (ADB) అధ్యక్షులు మసాటో కందాతో సమావేశమయ్యారు.
- వరద ప్రభావిత ఈశాన్య రాష్ట్రాలకు పూర్తి సహకారం అందిస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలిపారు.
- పూణేలో ఈరోజు దేశంలోనే మొట్టమొదటి వ్యవసాయ హ్యాకథాన్ ను మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ ప్రారంభించారు.
- దేశ 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని భారత రక్షణ మంత్రిత్వ శాఖ, మై జీఓవీ ఇండియా సహకారంతో యువతకు వివిధ పోటీలను నిర్వహిస్తున్నారు.
- రానున్న 7 రోజుల్లో ఈశాన్య భారతదేశంలో భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ (IMD) తెలిపింది.

============================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు న్యూఢిల్లీలో ఆసియా అభివృద్ధి బ్యాంకు (ADB) అధ్యక్షులు మసాటో కందాతో సమావేశమయ్యారు. గత దశాబ్దంలో భారతదేశం సాధించిన వేగవంతమైన పరివర్తన ఎందరికో సాధికారతను కల్పించిందని, ఈ ప్రయాణాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని ప్రధానమంత్రి సామాజిక మాధ్యమ వేదికగా పేర్కొన్నారు.

రానున్న 5 సంవత్సరాలలో మున్సిపల్, మౌలిక సదుపాయాల అభివృద్ధి, మెట్రో నెట్‌వర్క్‌ల విస్తరణ, నూతన ప్రాంతీయ రాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ కారిడార్‌ల నిర్మాణం, సేవలను ఆధునీకరించడం తదితర రంగాలకు 10 బిలియన్ డాలర్లను అందిస్తుందని ADB అధ్యక్షులు మసాటో కందా సామాజిక మాధ్యమ వేదికగా తెలిపారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారాలనే భారత్ ప్రయత్నానికి మద్దతు ఇస్తామని, 140 కోట్ల మంది ప్రజలకు సమ్మిళిత, స్థిరమైన వృద్ధిని అందించడానికి ADB సిద్ధంగా ఉందని ఆయన పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వ్యవసాయం ఆహారాన్ని అందించడంతోపాటు సంస్కృతి, పర్యావరణం, ఆర్థిక వ్యవస్థలకు పునాది అని మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ అన్నారు. ఈరోజు పూణేలో జరిగిన దేశంలోనే మొట్టమొదటి వ్యవసాయ హ్యాకథాన్ ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతూ... అవగాహనతో మనమంతా కలిసి పని చేస్తే వ్యవసాయం ప్రపంచ నమూనాగా మారగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. స్థిరమైన, సమగ్ర వృద్ధిని ప్రోత్సహించడం ద్వారా అనేక అవకాశాలను ఉపయోగించుకోవచ్చని చెప్పారు. రైతులు పరిశోధకుల తరహాలో ఆలోచించాలని, వ్యవసాయానికి శాస్త్రీయ విధానాలను అవలంభించాలని అజిత్ పవార్ అన్నారు. వ్యవసాయ శాఖ, మహాత్మా ఫూలే కృషి విద్యాపీఠ్, వ్యవసాయ కళాశాల, పలు అంతర్జాతీయ సంస్థలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ హ్యాకథాన్‌లో 1,800 మందికి పైగా పాల్గొని తమ ఆవిష్కరణలు, పరిశోధన పత్రాలను సమర్పిస్తారు. ఈ ప్రదర్శనలు ఈనెల 3వ తేదీ వరకు కొనసాగుతాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఫ్రాన్స్‌లో మూడు రోజుల అధికారిక పర్యటనను ఈరోజు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్ ప్రారంభించారు. ఈ పర్యటన కీలకమైన యూరోపియన్ భాగస్వాములతో వ్యూహాత్మక, ఆర్థిక సంబంధాలను మరింతగా పెంచుకోవడానికి, స్థిరమైన, సమ్మిళిత ప్రపంచ వృద్ధి కోసం ఉమ్మడి దృక్పథాన్ని ముందుకు తీసుకెళ్లడంలో భారతదేశ నిరంతర నిబద్ధతను ప్రతిబింబిస్తుంది.

ఫ్రాన్స్ ఆర్థిక మంత్రి ఎరిక్ లాంబార్డ్, ఫ్రెంచ్ వాణిజ్య మంత్రి లారెంట్ సెయింట్-మార్టిన్‌తో సహా ఫ్రెంచ్ మంత్రులతో ద్వైపాక్షిక సమావేశాలలో కేంద్రమంత్రి పియూష్ గోయల్ పాల్గొంటారు. ఇండో-ఫ్రెంచ్ ఆర్థిక భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం, వాణిజ్యం, పెట్టుబడి సహకారాన్ని పెంపొందించడానికి నూతన మార్గాలను అన్వేషించడంపై చర్చలు ప్రధానంగా దృష్టి సారిస్తాయి.

ఫ్రాన్స్‌లో ఉన్నత స్థాయి పర్యటనలో భాగంగా, వ్యూహాత్మక వ్యాపార సమావేశాలు, ప్రధాన ఫ్రెంచ్ కంపెనీల అగ్ర నాయకత్వంతో సమావేశాలు నిర్వహిస్తారు. ఈ పర్యటనలో భారతదేశం-ఫ్రాన్స్ బిజినెస్ రౌండ్ టేబుల్, భారతదేశం-ఫ్రాన్స్ CEO ఫోరం జరుగుతాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఈశాన్య రాష్ట్రాలలో భారీ వర్షాల కారణంగా సాధారణ జనజీవనానికి అంతరాయం ఏర్పండింది. నిన్నటి నుండి కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడటం, ఇళ్లు కూలిపోవడంతో 27 మంది మరణించారని అధికారులు వెల్లడించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. అరుణాచల్ ప్రదేశ్‌లో 9 మంది, మేఘాలయలో 6, అస్సాం, మిజోరాంలో 5, త్రిపుర, నాగాలాండ్‌లో ఒక్కొక్కరు మరణించారు. కొండచరియలు విరిగిపడటంతో అనేక జిల్లాల్లో రోడ్డు, సమాచార వ్యవస్థలు దెబ్బతిన్నాయి. పశ్చిమ బెంగాల్-బంగ్లాదేశ్ తీరాలకు ఆనుకుని వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ఉత్తరం వైపుకు ప్రయాణించి పశ్చిమ బెంగాల్-బంగ్లాదేశ్ తీరాలను దాటిందని, దీని ఫలితంగా ఈశాన్య రాష్ట్రాలలో భారీ వర్షాలు కురుస్తాయని హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ (MHA) తెలియజేసింది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమ బెంగాల్‌లో రాష్ట్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడంలో విఫలమైందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆరోపించారు. కోల్‌కతాలోని నేతాజీ ఇండోర్ స్టేడియంలో జరిగిన ర్యాలీలో ఈరోజు ప్రసంగిస్తూ... ఎన్నికల అనంతర హింస, సరిహద్దు చొరబాట్లు, అవినీతి, మహిళలపై నేరాలు పెరగడం పరిపాలనా వైఫల్యానికి సంకేతాలుగా ఉన్నాయని చెప్పారు. 2026లో జరిగే బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈ సందర్భంగా తెలిపారు.

==============================

దేశ 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని భారత రక్షణ మంత్రిత్వ శాఖ, మై జిఓవి ఇండియా సహకారంతో యువతకు వివిధ పోటీలను నిర్వహిస్తున్నారు. ఆపరేషన్ సిందూర్ – ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారతదేశ విధానాన్ని పునర్ నిర్వచించడం అనే అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో ముగ్గురిని విజేతలుగా ఎంపిక చేసి ఒక్కొక్కరికి 10 వేల రూపాయల నగదు పురస్కారంతో పాటు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనే అవకాశాన్ని కల్పిస్తారు. మరొక పోటీలో భారత స్వాతంత్ర్య స్మారక చిహ్నాలు, ప్రదేశాలకు సంబంధించిన వీడియోలు, రీల్స్ రూపొందించడంపై వర్థమాన సామాజిక మాధ్యమా ప్రభావశీలురకు పోటీలు నిర్వహిస్తున్నారు. దీనిలో విజేతలుగా నిలిచిన ఒక్కొక్కరికి 10 వేల రూపాయల నగదు బహుమతిని అందిస్తారు.

"నయా భారత్.. సశక్త్ భారత్.." ఇతివృత్తంతో చిత్రలేఖన పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ పోటీలకు సంబంధించిన సమాచారాన్ని My gov వెబ్ సైట్ నుంచి పొందవచ్చును. ఈనెల 30వ తేదీ వరకు ఈ పోటీలకు సంబంధించిన ప్రవేశాలను కల్పిస్తారు.

==============================

భారీ వర్షాల కారణంగా ప్రభావితమైన ఈశాన్య రాష్ట్రాలకు చెందిన నలుగురు ముఖ్యమంత్రులతో కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈ రోజు మాట్లాడారు. అస్సాం, మణిపూర్, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులను అడిగి వరద పరిస్థితి వివరాలను తెలుసుకున్నారు. కేంద్రప్రభుత్వం అవసరమైన సహాయాన్ని అందిస్తుందని తెలిపారు. ఈశాన్య ప్రాంత ప్రజలకు మద్దతుగా కేంద్ర ప్రభుత్వం నిలుస్తుందని అమిత్ షా అన్నారు. అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ కేంద్ర ప్రభుత్వ తక్షణ సహాయ ప్రతిపాదనకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా NDRF, SDRF, అగ్నిమాపక సిబ్బంది, స్థానిక అధికారులతో సహా రెస్క్యూ బృందాలు బాధితులకు సహాయం అందించే దిశగా పని చేస్తున్నాయి.

==============================

విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ ఈరోజు న్యూఢిల్లీలో ఎరిట్రియా దేశ మంత్రి ఉస్మాన్ సలేహ్‌తో సమవేశమయ్యారు. సామాజిక మాధ్యమం వేదికగా ఆ వివరాలు కేంద్రమంత్రి వెల్లడించారు. ఆరోగ్యం, విద్య, సామర్థ్య అభివృద్ధిలో ద్వైపాక్షిక సహకారాన్ని మరింతగా పెంచుకోవడంపై ఇరు దేశాల మంత్రులు చర్చించామని, ప్రాంతీయ పరిణామాలపై కూడా తమ అభిప్రాయాలను పంచుకున్నామని తెలిపారు. పహల్గామ్ ఉగ్రవాద దాడిని ఖండించడం పట్ల ఎరిట్రియా మంత్రిని జైశంకర్ అభినందించారు.

==============================

రానున్న 7 రోజుల్లో ఈశాన్య భారతదేశంలో భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ (IMD) తెలిపింది. దక్షిణ ద్వీపకల్ప భారతదేశంలో కేరళ, మాహే, కర్ణాటకలలో బుధవారం వరకు ఉరుములు, ఈదురుగాలులు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. జమ్మూ, కాశ్మీర్, లడఖ్, గిల్గిట్, బాల్టిస్తాన్, ముజఫరాబాద్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్, హర్యానా, చండీగఢ్, ఢిల్లీలలో బుధవారం వరకు ఇదే పరిస్థితులు ఉంటాయని పేర్కొంది. వాయువ్య భారతదేశంలో కొంకణ్, గోవాలో మంగళవారం వరకు భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. పశ్చిమ రాజస్థాన్‌లో రానున్న మూడు రోజుల పాటు ఇసుక తుపాను పరిస్థితులను ఉంటాయని IMD అంచనా వేసింది.

==============================

వాణిజ్య ఎల్‌పిజి సిలిండర్ల ధరను చమురు కంపెనీలు ఈరోజు నుండి 24 రూపాయలు తగ్గించాయి. 19 కిలోల సిలిండర్ తగ్గించిన తరువాత రిటైల్ ధర ఢిల్లీలో 1,723 రూపాయల 50 పైసలుగా ఉంది. గృహ వినియోగ ఎల్‌పిజి సిలిండర్ల ఛార్జీలలో ఎటువంటి మార్పు లేదు. ఈ సంవత్సరం ప్రారంభం ఏప్రిల్‌లో, గృహ వినియోగ ఎల్‌పిజి సిలిండర్ల ధరను 41 రూపాయలు తగ్గించారు.

==============================
==============================